# ఆశాభంగం

ఆ తలగడా అంతా కన్నీటిమయంగా వుంది. ఎండి పోయిన కన్నీటి చారలు కాటుక కళ్ల నుండి గడ్డంవరకూ అలుముకొని వున్నాయి. బిక్క మొహంతో ఆ రాధ—భీతిపడిన లేడికళ్ళతో చూచే వాళ్ళకి జాలి పుట్టేట్టుగా వుంది.

అత్తగారు వెంకమ్మ వచ్చి రాధని చూచింది. చూచి తల పంకించింది. ఓహో! అంది. ఏరా నాగేశం అంది బిగ్గరగా. నాగేశం వచ్చాడు. ఏమిట్రా నీ మతం, రాధని యిలా యేడిపించడం సరదా అనుకుంటున్నావా? రోజూ యేడిపించడమేనా? ఆడదానిని అలా యేడిపించడం—యేమనుకొంటున్నావో కాని—మగాడికి ఎంతమాత్రమూ జయం కాదు. గృహలక్ష్మి కంట తడిపెడితే యజమాని బ్రతుకు చీకటిమయం! యేమనుకొంటున్నావో. చాలు-చాలే నువ్వూ నీ మోటుతనమూను. బంగారంవంటి పిల. ఏలుకోవడం చేతకాదుట్రా! అంది తల్లి వెంకమ్మగారు ఏకైక పుత్రుడు నాగేశంతో.

కళ్ళు తుడుచుకుంటూ - రాధ దొడ్లోకి పోయింది. కంఠం ఇంతగా హెచ్చించి అందుకున్నాడు నాగేశం. నీకైతే ముద్దుల కోడలు కావచ్చు. మేనకోడలు కావచ్చు. నీకు నచ్చితే నచ్చవచ్చు. ఈ పల్లెటూరి గబ్బిలం—యీ గుడ్లగూబ నా పెళ్లాం అని చెప్పుకోవడానికే సిగ్గువేస్తూంది. దాని మొహం చూస్తేనే డోకు వస్తుంది. ఇలాంటి బండపెళ్లాన్ని కటపెట్టిందే కాకుండా—ఇంకా తీర్పులు తీరుసావెందుకమ్మా? దానితో నాకు సరిపడదు. ఈ దాంపత్యం శోభ ఇంతే. ఈ జన్మకి అన్నాడు నాగేశం.

నాకు నచ్చలేదురా నాగేశం. పల్లెటూరు గబ్బిలం అంటే యేమిటి నీ ధోరణి. ఇంకా మంచి - మర్యాద - సంఘీభావం వున్నాయంటే అవి పల్లెలలోనే వున్నాయి. బస్తీ బ్రతుకులో యేముందిరా! ఆనందం—ఆరోగ్యం-పల్లెల్లోనే వున్నాయి. మర్మం లేని ప్రేమ పల్లెటూరి వారిది. తాత్కాలికంగా చమక్ చేసేది బస్తీ స్నేహం.

పల్లెటూరిపిల్ల గబ్బిలమూ కాదు. బస్తీపిల్ల కాకపోనూ లేదు. నేను పల్లెటూరులో పుట్టలేదూ. మీ నాన్నతో దర్జాగా కాపరం చేయలేదూ, అదృష్టం పండాలి - నిండాలి కాని భార్యకి పల్లె - బస్తీ భేదంతో సంబంధం లేదురా-నాగూ.

అమ్మా - నీ రోజులు వేరు. ఈ రోజులు వేరు. కాలం మారినకొద్దీ నాగరకత మారుతుంది. పాతపద్ధతిపోయి కొత్తపద్ధతి వస్తుంది. పాత కొత్తల పరిణామాన్ని గమనిస్తూ నరనారీలోకం జీవితాన్ని సాగించాలి. ఎప్పుడూ పాత చింతకాయ పచ్చడి లాగ నవ్యత - ఒక వినూత్నత్వం లేని కాపరంలో చహాల్ వుండదు. ఈ పల్లెటూరి పిల్లలో మగాడి మోటుతనం మినహాయిస్తే ఆడదాని అందం - ఆ లాలిత్యం శుద్ధశూన్యం. నీకు కోపం వస్తే వచ్చింది కాని నా ప్రేమ సంపాయించాలంటే మీ కోడలులో చాలా మార్పులు రావాలి. ఆమార్పు లేకుండా నామీద నీవు వాగ్ధాటిని ప్రయోగించినా ప్రయోజనం లేదు నేను ఆఫీసుకు పోవాలి అంటూ నాగేశం తల్లి చెప్పే మాటల్ని కూడా వినకుండా ఆఫీసుకు పోయాడూ.

* * *

రాధ-పల్లెటూరి పిల్లట! మార్పులు రావాలట! మార్పు వస్తేనే కాని తన ప్రేమలభ్యం కాదట!—ఇదీ తనముద్దుల కొడుకు నాగేశం వాదం. తమ్ముడి కూతురు. పుట్టినప్పుడే తన కోడలని మురిసిపోయింది యీ వెంకమ్మ. బ్రహ్మానందంగా జరిగించింది పెళ్ళి, ఆ పెళ్లి

## అయ్యగారి విశ్వేశ్వరరావు

[illegible] చింది. అంతే, రానురాను రాధ కాపరం కన్నీటిమయం. ఏడవనిరోజు లేదు. ఎందుకలా యేడిపించడం అంటే నాగేశం వాదం యిది.

నాగేశం బి. ఏ. ప్యాసయ్యాడు. తన తండ్రి చిన్నప్పుడే పోవడం, మేనమామ తమకు సంరక్షకుడుగా వుండడం జరిగింది. తమ్ముడు చేసిన మేలు వెంకమ్మ యెలా మరిచిపోతుంది? కష్టకాలంలో కడుపులో పెట్టుకొని కంటికి రెప్పగా కాపాడిన తమ్ముడు-అలాంటి తమ్ముడు దగ్గర కట్నం కూడా పుచ్చుకోకుండా రాధని తనకొడుక్కి చేసుకుంది. నాగేశానికి బస్తీలో వుద్యోగం. చదువుకొన్నప్పుడు లేని కొన్ని అలవాట్లు - నాగేశానికి ఉద్యోగంలో చేరాక అబ్బుతున్నాయి.

ముఖ్యంగా అతనికి కావలసినది చదువుకొన్న పెళ్లాం. ఇంగ్లీషు బాగా వచ్చిన పెళ్లాం కాలేదే అని మొత్తుకుంటాడు. తన మాటలతో కితకితలు పెట్టి-నవ్వి నవ్వించే పెళ్లాం కావాలంటాడు. ఆఫీసునుంచి ఏంతో భారంగా తాను యింటిలోకి వస్తున్నప్పుడే-ముసిముసి నవ్వులతో స్వాగతం చెప్పి-పన్నీటి జల్లువంటి చల్లని అయిసుక్రీము మాటల్ని వదిలి వాడిన తీగకు వసంతం వచ్చినట్లుగా అలసిపోయిన తనకు ఆనందం యిచ్చే పెళ్లాం వుంటే ఎంత బాగుండును? అంటాడు.

వెంకమ్మగారి దృష్టిలో ఒక్కటే వేదాంతం. పెళ్ళి మానవుడి చేతిలో లేదంటుంది. అది కేవలం దైవబలం మీద ఆధారపడివుంది అంటుంది. ఘటన తప్పించేవాడెవడూ లేడంటుంది.

ఈ మాటలు నాగేశానికి రుచించవు. వివాహం అనేది రెండు మనసత్వాల కలయిక. ఆ కలయిక కలకాలం వుండేటట్టయితే మంచిది. నచ్చని పెళ్లి - బలవంతపు పెళ్లి - మేర్పానీ పెళ్ళి-యిలాంటి పెళ్ళిళ్ళు చేయడం కట్నాలకో - లాంఛనాలకో - ఆస్తికో - పాస్తికో అవుతూ ప్రేమకి విలువ లేకుండా పోయిందంటాడు నాగేశం. అందుచేతనే విడాకుల చట్టం అవసరమంటాడు నాగేశం.

ఒకరికిచ్చిన విడాకులే-యింకొకరి కివ్వడం వల్ల విడాకులు చవక అయిపోయి ఆడదానికిగాని మగాడికిగాని శీలసంరక్షణకి అవకాశం నశించుతుందనీ-తద్వారా శరీరం చెడిపోతుందని వాదిస్తుంది వెంకమ్మ.

నేను వారికి నచ్చకపోతే-నా మూలంగా వారిని నష్టాలపాలూ-కష్టాలపాలూ కావద్దని చెప్పండి అత్తగారూ. నేను కోరేది వారి ఆనందం. ఎక్కడ వున్నా సరే-ఎప్పుడైనా సరే వారి ఆనందమే నే కోరేది. నా అనుమతితో వారు ఇంకో నచ్చిన పెళ్లాన్ని చేసుకోవచ్చు. నేను అడ్డురాను, లేదా - నన్ను యింటిలోంచి పొమ్మనమంటారా-పోతాను. బాధపెట్టకుండా పోతాను. వెళ్ళి కూడా మీ యింటి మర్యాదకే నా ప్రాణం త్యాగం చేస్తాను-నమ్మండి నా మాటలు అని గుండె కదిలించేటంత దీనంగా చెప్పింది రాధ. వివేకానికి వయోభేదం లేదుకదూ.

ఏమనగలదు? వెంకమ్మ చెవులారా వింది. ఆ రాధ మాటల్ని విని ఏమనగలదు? ఆలోచించింది. తాను బ్రతికి వుండగా తన మేనకోడలు గడపదాటి పుట్టింటికిపోతే ఎవరికి ఆ అవమానం? తన తమ్ముడు ఎంత బాధ పడతాడు? తన కెంత బాధ? తన మేనకోడలు స్థానం యింకో గిలుబంగారం పెళ్లాం ఆక్రమించుకుంటే తనకి అదృశ్యం ఆనందం యిస్తుందా? ఎలాగ-యీ చిక్కు సమస్యను తీర్చేది. వెంకమ్మ ఆలోచిస్తోంది. రూపంలో యేలోటూ లేదు. రాధ నిజంగా చక్కని చుక్క. కాని పల్లెటూరునుంచి వచ్చిన పిల్లకదా. ఈ పేషన్లు తెలియవు. సీతాకోక చిలకలాగ క్షణక్షణం సింగారించుకొనే చలాకీతనం యెరగదు. మంచి శా ముస్తాబయిన ఆడది ఎదురయితే-'అంద

ఆనందం' అని రాగం తీస్తూ అనురాగాన్ని ఆరాధిస్తాడు మగవాడు, ఇలా అనుకుంది వెంకమ్మ. రాధని పిలిచింది. బజారుకు పోదాం రావే రాధా అంది. ఇద్దరూ యేవిటేవిటో చెప్పుకుంటూ వెళ్లారు, ఎక్కడికి వెళ్లారో-యెక్కడెక్కడ తిరిగారో మరి చాలాసేపటికిగాని యింటికి రాలేదు. వచ్చేటప్పుడు కూడా ఎంతో సామగ్రి ఎన్నో బట్టలు తెచ్చారు. ఎందుకో?

నే చెప్పినట్లుగా ముస్తాబైరా రాధా. ఒక చిన్న గమత్తుచేస్తా అంది వెంకమ్మ. చిందరవందరగా వున్న ఆ హాలు చాలా నీటుగా మారింది. బూజుపట్టిన గోడలు క్యాలండర్లతో ఫొటోలతో కిలకిలలాడుతున్నాయి. కీ యివ్వకపోవడంవల్ల ఎప్పుడో ఆగిపోయిన గోడగడియారం చలాకీగా తిరుగుతూంది. వీధి గుమ్మానికి కర్టెను. మధ్య గుమ్మానికి కరెను. ఒక పూలచెండు స్టాండు ఆనందంగా అమిరింది. బూజుపట్టిన టేబిలు మీద పుస్తకాలన్నీ అలమారులో సోకుగా తొంగిచూస్తున్నయి. నిగనిగలాడే టేబిలు క్లాత్ వెంటనే ఆకర్షించేస్తోంది. ఎడాపెడా కుర్చీలు. ఎంతలో మార్పు. అక్కడ వున్న రాధాకృష్ణ ఫొటోకి ఘుమఘుమలాడే పూలమాల. వెతుక్కోవలసి వచ్చేది నాగేశానికి రోజూ జోళ్లు. అలాంటి జోళ్లు సరళరేఖాన్యాయంలో అల్లరి చెయ్యని బుద్ధిమంతుడిలాగ వీధిగుమ్మం ప్రక్క తలుపు చాటున వున్నాయి. శుభ్రత-సంతోషానికి ఒక మారిమే అనుకుంది వెంకమ్మ.

చిరాకుగా రిక్షాదిగి - తలనొప్పితో భారంగా యింట్లోకి వస్తున్నాడు నాగేశం. వీధిగుమ్మం కర్టెనుమీద నమస్తే అక్షరాలున్నాయి. నాగేశానికి అనుమానం వేసింది. కొంప తివ్వి-తలపోటు ధాటిలో ఒక గుమ్మం యెక్క బోయి యింకో గుమ్మం యెక్కుతున్నానా? అనిపించింది. తెర తప్పించుకుని యింట్లోకి వెళ్ళాడు. మూల పడిపోయిన ఆనాటి పెళ్లిఫొటో ముస్తాబై ముసిముసి నవ్వులతో ఆహ్వానించడం చూశాడు నాగేశం. ఏమిటీ! ఒక రోజులో రాజైనట్టు ఒక పూటలో ఈ యింట్లో ఇంత 'నీట్నెస్' అవతరించిందే అనుకున్నాడు అతడు. ఈజీ చెయిర్‌లో వ్రాలేసరికి తల్లి - వెంకమ్మ తయారు. వచ్చావా - నాయనా అంటూ సీలింగు ఫానుకు స్విచ్ ఆన్ చేసింది. అః మా అమ్మలో యింత మార్పా? అనుకున్నాడు. పోయి ముఖం కడుక్కోరాదూ అంది. నాగేశం బాత్ రూములోకి పోయాడు. పాకుడుపట్టి జారిపోయే ఆకస్మిక ప్రమాదాలకు ఆలయంగా వుండే ఆ బాత్ రూం ఎంత బావుంది, దర్జాగావుంది. మకిలిలేని పాత్రలు. ఆరోగ్యకరమైన ఫినైలు చిలుకులు. రుద్దుకోవడానికి సబ్బు - ఆ సబ్బుకి ఒక పెట్టె. తుడుచుకోవడానికి ఒక తుండు. ఆహాఁ అనుకోనట్లుగా ఇవాళ యింత రిఫార్మేషను యీ యింట్లో అవతరించడం తన జీవితానికి రినయసెన్సు అనుకున్నాడు నాగేశం. అనుకుంటూనే మళ్లీ హాలులోకి వచ్చాడు. తల్లి-టీ తెచ్చింది. భూలోకస్వర్గంలా వుందే యీ వేళ అనుకున్నాడు. కొడుకు ఎలాంటి అనుభూతిని ఆరగించాడో అని వెంకమ్మ కనిపెడుతూంది. మనస్సుయొక్క ప్రతిబింబమే గదా ముఖం-అనుకుంటూ కొడుకు చూపించే ఆశ్చర్యానికి ఆనందిస్తూంది వెంకమ్మ.

"అయితే కాని అమ్మా - రాధ ఏదమ్మా" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఎందుకురా నాయనా - నీకిష్టం లేని రాధ మాట అంది వెంకమ్మ.

'అలా కాదమ్మా - యేమయిందంటావ్ - యెక్కడా కనిపించదే! అందుకనే నమ్మా అడుగుతూంట' అన్నాడు నాగేశం.

'కోపగించుకొని పుట్టింటికి వెళ్ళిందిరా. ఎంత చెప్పినా వినలేదు. ఇంకేం చెయ్యను. పోతూంటే అలా వింతగా చూస్తున్నాను" అని వెంకమ్మ చెప్పబోతూంటే నాగేశం అడ్డువచ్చి—"పోతే పోయిందిలే. పీడ వదిలింది. ఆ గూబతో నీకూ లేదు శాంతి - నాకూ లేదు ఆనందం. దర్జాగా విడాకులిచ్చి ఇంకో నచ్చిన పిల్లతో రిజిస్టరు మ్యారేజి చేసుకుంటానమ్మా. ఏమంటావ్? నీ అభిప్రాయం, యేమిటి అంటున్నాడు నాగేశం. ఆశ్చర్యం యేమీ ప్రకటించకుండా, ఆ వెంకమ్మ మొదలు పెట్టింది. "నీ ఆనందమే నా ఆనందం నాయనా. తమ్ముడి కూతురని మురిసిపోయాను. వంశాన్ని వుద్ధరిస్తుందని ఎంతో ఆశపడ్డాను. ఒక్క తోక పట్టుకుని గోదావరి యీదగలమా నాయనా? ఆమనిషి వరస ఆఖరికి ఇంత అయోమయం అయింది. బాగా ఆలోచించు. నీ ఆనందానికి నేనేమైనా చేస్తాను. నా వంశానికి నీవు ఒక్కడివే గదా. నువ్వు బెంగటిల్లినా, దెబ్బలు పడినా-కూలినా-కుంగినా నాకు కొదుట్రా నాయనా" అంది జాలి నటిస్తూ కొడుకుతో.

తల్లి ధోరణి చూసి నాగేశం బ్రహ్మానంద భరితుడై మళ్ళీ అందుకున్నాడు. "పోయింది మన శనిగ్రహం పోయింది. మనకు ఇంక పిశాచపీడ లేదు. పోయిన మరుక్షణంలో నే మనఇల్లు ఎంత కలకలలాడుతూందో చూడు. రోగం పోయాక రోగికి కులాసా వచ్చినట్టే-ఆ రాధ అలా పోగానే నా ఆనందం - నీ ఆనందం లోటు లేకుండా-నిత్యనూత్నంగా వుంటాయమ్మా. నువ్వు ఊఁ అను. నాకు నచ్చిన పిలను నేనే ఏరుకొని-నీ సమక్షంలో రాధకి విడాకులిచ్చి - కొత్త కోడలిని తెస్తాను. నీకు ఆనంద వర్షం కురిపిస్తాను. దైన్యం-హైన్యం లేని చలాకీ జీవితానికి సోపానాలను నిర్మిస్తా. బ్రతికేది బాధలకి కాదు - మాధుర్యాన్ని - జీవిత మాధుర్యాన్ని గ్రోలడానికే! అని బుజువు చేస్తానమ్మా! ఎంత మంచిరోజు! జీవిత రథచక్రాన్ని సవ్యమార్గంలో తిప్పించిన గొప్పరోజు!" అంటూ హాయిగా తల్లితో బాతాఖానీకొడుతున్నాడు నాగేశం.

నాగూ! అంది హఠాత్తుగా వెంకమ్మ. ఏమిటమ్మా? అన్నాడు నాగేశం. మళ్లీ అందుకుంది వెంకమ్మ. రాధ గడపదాటాక చిరాకుగా—చింతాక్రాంతంగా వున్నానురా. పాపం యెవరో ఒక ఆమె —నాగేశంగారున్నారా అంటూ వచ్చిందిరా, లేరమ్మా ఆఫీసుకు పోయారు అన్నాను. లోపలకు రమ్మన్నాను. సూటుకేసుతో వచ్చింది. నువ్వంటే ఎంతో ప్రేమట. పేరేమిటన్నాను; ఊరేమిటన్నాను. సిగ్గుపడింది. నాగేశంగారు నాకు భర్త అవుతారని ఎంతో తహతహలాడాను. ఘటన మాకు లేదు అంది కన్నీరునిండిన కళ్లతో. నా మనస్సు కరిగింది. ఒకసారి వారిదర్శనం చేసుకుందామని వచ్చానంది. మీ కోడలు యెక్కడమ్మా అంది. కోడలుమాట ఎత్తేసరికి గుండె గుభేలుమంది. రాధ వెళ్లిపోవడం చూసే అడుగుతోందా? అని! ఏం కోడలు




జామ్-బక్

పాదముల వాపు నొప్పిని శమనపర్చి నివారించును

కాళ్లవాపులు, వ్రణములు, కురుపులు, కాలినపుండ్లు విషగాయములు, జామ్-బక్ గొప్ప చర్మ ఆయింట్మెంటుతో త్వరలో మానును. జామ్-బక్ చర్మంలోకి పోయి, గుణమిచ్చే ఔషధము దీనిలో జంతు క్రొవ్వులు నూనెలు లేవని గ్యారంటీ చేయబడినది.

చర్మ వ్యాధి నివారణకు, చర్మ సౌందర్యమునకు, ఒక్కటే జామ్-బక్ జిగటగాలేని ఔషధ క్రీమును వాడిచూడండి.

Zam-Buk

జామ్-బక్
మూలికా బామ్
మరియు
ఔషధ క్రీమ్



అ. మందుల వ్యాపారులందరివద్దను దొరుకును.

ఏ.ఇ. పల్‌ఫోర్డ్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ బొంబాయి.

సోల్ ఏజెంట్లు: దావా & కంపెనీ, 86, తైనప్పనాయకన్ వీధి, మద్రాసు-8

# ★ ఆశాభంగం ★

తల్లీ—తండ్రీ బాగాలేదని పుట్టింటికి పోయిందమ్మా—అన్నాను. అలా వున్నారేం అత్తగారూ అంది. ఆ పిల అలా అనేసరికి—నువ్వే నా కోడలైతే ఎంత బావుండును! మా అమ్మా!—అనుకున్నాను—" అని వెంకమ్మ యింకా చెప్పుతూండగానే నాగేశం—తల్లీ యిలా మాట్లాడుకుంటున్నారు.

"అయితే—అమ్మా—ఆ అమ్మాయి పేరు అడిగావా?"

"మరిచిపోయానురా! ఒకసారి అడిగితే సిగ్గుపడిందని."

"పోనీ—వూ రడిగావా."

"చెప్పడానికి—సిగ్గుపడిందిరా—తరిచి తరిచి యేం అడగగలను చెప్పు."

"సరేకాని—పిల్ల బాగా చదువుకుంది కదూ?"

"అలాగే వుంది."

"చేతికి రిస్టువాచీ వుందా?"

"ఆఁ."

"చక్కగా—ఎర్రగా బుర్రగా వుంది కదూ."

"ఔనురోయ్—అచ్చంగా అంతే."

"సరేలే—కానీ—నువ్వు చెప్పేది చెప్పు—ఆ తర్వాత ఏం జరిగిందో."

"ఏం జరగడమేమిటి? సూటుకేసు తీసింది. ఈ కర్టెను కట్టింది. దానీ దానిలాగే యిల్లంతా వూడ్చింది. బల్లలు—బెంచీలు సర్దింది. పటాలు గోడలకు పెట్టింది. ఈ ముస్తాబంతా ఆవిడ చేసినదే. ఎలావుందంటావ్—నాకుమట్టుకు ఆనందంగా వుంది"

"దర్జాగావుంది. ఆ రాధ ఎన్నడైనా కాంపిల్‌కి యిలా సర్దిందా? మల్లెపువ్వు మల్లెపువ్వేనమ్మా! ఉల్లి—ఉల్లే. మనుష్యుల నడవడినిబట్టే ఇల్లు కలకల లాడుతుంది. చిరాకుగా యింటికి వచ్చేసరికి—ఆరాధ నడవడి యింకా చిరాకు హెచ్చించేది. భార్య అంటే ఎలా వుండాలి? పునూరు మయ్యా లాగ ఎప్పుడూ ఏదో రోగం. చూసేసరికే జోరు! ఎప్పుడు బయటకుపోతామా? అనిపించడం. ఇల్లు హాయిగావుంటే వేరే పార్కులెందుకు? బీచ్ షికార్లు ఎందుకు? హోటలెందుకు? ఎయిర్ కండిషన్డు గదులెందుకు? ఆనందం కొల్లలుగా యింట్లో వుంటూంటే! యేమంటావ్? అమ్మా"

"ఔను నాయనా ఎంత చురుకుదనం. ఎంత చలాకీ నవ్వి—నవ్వించడం—ముత్యాలూ మొహిరీలు రాలికాయిరా! అనుదుమోవాం లొంచి—అలాంటపిల్ల కోడలుగా వుంటే—రోజూ మనయిల్లు యిలాగే వుండునుగదా—అనుకున్నానురా"

"నువ్వు ఊఁ అనాలిగాని—ఎంతసేపమ్మా! ఆపిల్లని నేను ఎరుగుదునులే. చాలా మంచి పిల్ల. సంప్రదాయం మంచిది. వాళ్ళనాన్న రిటైర్డు కలెక్టరు. డబ్బుకి లోటులేదు; మర్యాదకి లోటులేదు. బాగా చదువుకున్న పిల్ల కాలేజీలో నాక్లాసుమేటు. పెళ్ళి అనేది కాని—అంత బలవంతం పెట్టలేదు. మీతమ్ముడికి దడిసి—నీకుదడిసి ఆమాట ఎత్తలేకపోయాను"

'అలాగా—నాకూ—అందుకనేకామోను నీకోసం యింకా ఆగదిలోనే అలాకూర్చుని వుంది. ఈపూటకి ఇక్కడ వుండవమ్మా అని ఎంతో బలవంతం చేశాను. అసలు—ఆవమాలు కడతారో కట్టలేరో? చూదాం అందిరా.'

'చెప్పావుకాదు. రాధవెళ్ళడం. నాకు నచ్చినపిల్ల తనంతట తానే రావడం—బావుంది తల్లీ—ఎక్కడవుంది" అంటూ నాగేశం చరచరా ప్రక్కగదిలోకి పోయాడు—వెంకమ్మ వెంబడి.

ఆ గది నూత్నశోభతో వుంది. ఆ శోభకి తగినట్టు—ఆపిల్ల సునసిగుతో పమిటసర్దుకొని మేలిముసుగు వేసుకొనివుంది. కమ్మని సువాసనలు కమ్మిన గదిలో—తికమకలు తీరినట్టుగా నాగేశం ఆకూర్చున్న ఆమెవైపు చూశాడు. ముఖం మేలిముసుగులో దోబూచు లాడుతూంది. ఆసింగారాల సిల్కు చీర—ఆజయ్యారపు జాకెట్టు—ఆ సౌందర్యపోషణ ఫక్కీ రాధని పుటంవేసినావస్తుందా అనుకున్నాడు నాగేశం.

నాగేశం రాగానే సన్నని సన్నాయి గొంతుకతో—ప్రతి అక్షరానికి తేనెచినుకులు చిమ్ముతున్నట్టు—నమస్తే అంది ఆమె. ఒళ్ళు తెలియని సంతోషంతో తానెవరైంది? ఎక్కడున్నదీ ఎదుటివారెవరైనది తెలియలేక పోతున్నాడు నాగేశం. చాలామంచి పిల్ల—ఎంతో మంచిపిల అనే పల్లవిని మానలేదు వెంకమ్మ. ఇంక నాగేశం—తల్లిని విడిచి ఆమెతో ఆరంభించాడు.

"మీపేరు కాంతీశోభకదూ?"

"ఊఁ."

"పాపం—మీనాన్నగారు కాలంచేశారని విన్నాను."

"........."

"బాధపడకండి. ఇవాళ సుదినం. మీ రెలా వున్నారా? అని నేను చాలాకాలంనుంచి ఆలోచిస్తున్నాను. ఈవూళ్ళో మీ చుట్టాలింటికి యీ వారంలో వస్తారని విన్నాను. ఇప్పుడే మీ చుట్టాల్ని అడిగితే—యింకా తెలియదు—ఎప్పుడు వచ్చేదీ అన్నారు—వెరీగుడ్—మీరు యింకా యిక్కడికి రావడం—అందులోనూ మా ఆవిడ వూరికి పోయిన మరుక్షణమే మీరురావడం బ్రహ్మానందం."

"ఎంత మాట!"

"అలా అనకండి. మా అమ్మ మిమ్మల్ని ఎంతో మెచ్చుకుంటోంది. మీరే ఆవిడకు కోడలయితే—ఈ ఇల్లు ఇలా కలకలలాడుతూ ఎప్పుడూ ఇలాగే ఉంటుందనుకుంటోంది."

"ఎంతమాట!"

"మీ రలా అనకపోతే—ఏమంటారు లెండి," అని అన్నాడేకాని—నాగేశానికి—ఎదుటమనిషి అన్న "ఎంత మాట!"—మాటలన్నీ రాధ గొంతుకలోంచి వచ్చినట్లున్నాయి. సుపరిచితకంఠంలాగే వుంది. కాని వెంకమ్మ ఆ పిలని మెచ్చుకుంటూన్న ధోరణిని పరకాయిస్తే, ఇదిమాత్రం రాధ కాదు—రాధగొంతుక కాదని నమ్మకతప్పదు. నాగేశానికి ఇంటి కలకల—తల్లి చూపించే మెప్పులు—ఈవిడ తన స్వప్నసుందరి అయి వుండాలని తీర్మానించుకున్నాడు. నిన్న రాత్రే తనకు కల వచ్చిందట. రాధని సాచి లెంపకాయ కొట్టినట్టు. రాధ మళ్ళీ ఎదురు తిరిగినట్టు. దాంతో—ఛో! అవతలకు పో అన్నట్టు—కోపగించుకొని రాధ పుట్టింటికి పోయినట్టు, రాధ గడప దాటడం కలలో కనిపించడం—ఆ కల నిజం కావడం—కలలు ఒకప్పుడు నిజాలే అనుకున్నాడు నాగేశం.

ఆ పిల్ల ముఖాన్ని దాచుకుంటూంది. వచ్చినా చూపించటంలేదు. ముఖం కనిపిస్తే బాగుండును. ఇంకా చనువుగామాట్లడడానికి వీలుండేది, కాంతీశోభ ఎంత మంచి పిల్ల! కాలేజీ క్లాసుల్లో తనకు సహాధ్యాయి. చిన్నపూసలాంటి మనసు. బరువు అనిపించే బ్రతుకును తన మురుపులలో మటుమాయం చేసిన శీలవతి. మనసు యివ్వడమే తెలుసును కాని మళ్ళీ మార్చుకోవడం ఎరగనే ఎరగదు. నా దేకానికి అన్నీ జ్ఞాపకానికి వస్తున్నాయి. కాంతీశోభ పోలికలు యీ అమ్మాయిలో లేకపోలేదు. కాని చాలా రిజర్వుడుగా వుంది! ఎందుకంట! మా అమ్మని ఇంతే ముస్తాబుతో బుటలో పెట్టింది. అద్దువచ్చే రాధ పుట్టింటికి పోయింది. నేనా చిరక్క




# ★ ఆశాభంగం ★

చికుణ్ణి. ఎందుకీ నునుసిగు! కాళిదాసు చెప్పినట్టు-సిగూ-సిగా ఆడదానికి అందాలట! ఎంత చదువుకొన్నా-సిగు లేకుండా వుండే ఆడది. ఛీ అనిపించుకుంటుంది. అలాగే మన కాంతీశోభ సిగ్గుపడటంలో తప్పేమీ లేదు. రెండో పాయింటు-చనువు ప్రేమేకే పెంచదేం! ఒకే రకపు భావాలతో అరమరిక లేకుండా యింటా బయటా జంటకవుల్లాగ తిరిగామే. అందరూ మమ్మల్ని అప్పుడే అలుమగలనేవారే! అంతమంది అనుకున్నా లెక్క చేయకుండా బావా మరదళ్ళలాగే బ్రహ్మానందం పడలేదూ. కాలేజీ డ్రామాల్లో మేమిద్దరం నాయికానాయకులమై ప్రేక్షకలోకానికి ఉక్కపోత లేకెత్తించిన మాట మరిచిపోయిందా? యిలా ఆలోచిస్తూ ఏం కాంతీ-నన్నింకా పరాయి వాడినిగా చూస్తావేం-ఎప్పుడు నేర్చుకున్నావు ఇంత సిగ్గు-ఎందుకంట ఈ రిజర్వుడు నెస్-రా-కాంతీ! హాయిగా-నీ హృదయం విప్పి చూపించు. ఎన్నాళ్ళకు కలుసుకోగలం-అని ఇద్దరం అనుకున్నాం పరీక్షలయ్యాక పోయేముందు, నీ మధ్య-నా మధ్య సంఘం రాధ అనే ఆనకట్టను కట్టింది. మన ప్రేమ ప్రవాహాన్ని ఆ ఆనకట్ట అరికట్టగలదా చెప్పు కాంతీ-కాలం తిరిగింది. మార్పు వచ్చింది. పెద్దలు కట్టిన పాడు ఆనకట్ట పగిలింది. ప్రేమ ప్రవాహం కెరటాలు వేసుకుంటూ స్వార్థపరుల్ని కేలి చేస్తూ చెంగుచెంగున పారుతూంది. రా-కాంతీ-ఆలస్యం చేస్తావేం - నా ప్రక్క కుర్చీలో కూర్చొని ఎలా గడిపావో నీ జీవితాన్ని-ఏ అనుభూతుల్ని పొందావో చెప్పవా కాంతీ! అంటున్నాడు నాగేశం ఆవేశంతో.

ఆ ముసుగులోని ముద్దరాలు ముసిముసి నవ్వులు నవ్వుతూంది.

అలాగయితే-ఈ పిల్ల నీకు పాత పరిచయమే-ఏవిటో అనుకున్నానురా నాగూ. రాధమీద నీకు ప్రేమ లేదనీ-నీ ప్రేమధనం యీ కాంతీశోభ అనీ-ఆ సరిపడని సంగతులతోనే రోజూ మీ దంపతులు ధడాబెడీ చేయడం అన్నమాట అంది వెంకమ్మ.

నాగేశం వెంటనే అందుకున్నాడు. అమ్మా క్షమించు, ఈ ఆనంద సమయంలో ఎందుకమ్మా ఆ తోకచుక్క పేరు. దాని పేరు తలపెట్టకూ, చూడు. ఈ కాంతిని చూడు. ఈ కాంతి శోభని చూడు! ఎంత నిదానం! ఎంత నెమ్మది! ఎంత బుద్ధి! ఏం నీట్ నెస్! చూసేసరికి చల్లని పన్నీటి జల్లు. నా అదృష్టం కొద్దీ ఆ రాధ పోయింది. ఈ కాంతి వచ్చింది—అన్నాడు.

అలాగయితే నాగూ-రాధ పేరు మరిచిపో ఈ పిల్ల పేరు కాంతి అంటావుగా ఇక నేనా యిలా అనుకుంటూ. ఇంటిలో పోరు పెట్టకూ మనస్సు పాడుచెయ్యకు; పాడుచేసుకోకు. నాకు వంటింట్లో పనుంది. కొంచెంసేపు మీరిద్దరూ మాట్లాడుకోండి- నేవస్తాను కాంతీ అంటూ వెంకమ్మ వెళ్ళిపోతూంది. అమ్మా-ఆగు అన్నాడు నాగేశం. వెంకమ్మ ఆగింది. నాగేశం ఇలా అంటున్నాడు; "రాధ వెళ్ళిపోయింది. కాంతి వచ్చింది. నీకూ-నాకూ కాంతినిచ్చింది. కాంతిని ఆటవస్తువుగా నన్ను వాడుకోమంటావా? ఇది తప్పు కాదా? యేమంటావమ్మా?" అన్నాడు.

అలాంటి దుర్మార్గుడివి కాదని నాకు తెలియదా నాగూ! అంది వెంకమ్మ. అంచేత నేనమ్మా. రాధని మళ్లీ రాకుండా చెయ్. ఈ కాంతిని నా ధర్మపత్నిగా చెయ్. ఇలు ప్రశాంతంగావుంటుంది. మనస్సుకి విశ్రాంతి వుంటుంది. ఈ ఖ్యాతి నీకే దక్కుతుంది. ఏనాడో ప్రేమించుకున్నాం. ఆనాడే భార్యాభర్తలం అనుకున్నాం. సంఘానికి బెదిరి బెదిరి పోయాం. దేవుడు దయామయుడు. కనిపించని దేవుడు నీ స్వరూపంలో యీనాడు సాక్షాత్కరించాడు. నా కోరిక తీరింది. నా కాంతి దొరికింది. కాదా కాంతీ?" అని అడిగాడు.

ఆ ముసుగులోని పిల్ల పక పక నవ్వింది. నవ్వుతో ముసుగు జారింది. ముసుగు కింద పడే సరికి ముఖం కనిపించింది. ముఖం కనిపించేసరికి నాగేశానికి గొంతుక సన్నగిల్లడం-గుటకలు వెయ్యడం - నాలుక చప్పరించడం అనుకోనట్టుగా ఆ కుర్చీలో కూలబడటం! కలయో- వైష్ణవమాయయో! అనుకున్నాడు నాగేశం. అక్షరాలా ఆ పిల్ల పాత రాధ!

ముసుగు లేని పిల్ల - మోసం చేసి మోసాన్ని పట్టిన పిల్ల - రాధ చూసింది బాధపడే నాగేశాన్ని, ఎంత చెడినా మొగుడే నని క్షమించింది.

ఇంత చేశావా! పుట్టుండి యింత నాటకం ఆడారా! ఎవరు నాటక రచయిత? ఎవరు యీ నాటక ప్రదర్శనానికి దర్శకులు? ఎంత రక్తి కట్టింది? మగాడు—ఆ వేశంలో అంతా మరిచిపోతాడు. తన బ్రతుకు రహస్యాల్ని కూడా దాచుకోలేడు. ఎంత పని చేయించావే? అమ్మా! అనే భావాల్ని విరజిమ్మే జాలిచూపులు నాగేశం కళ్లల్లో వున్నాయి.

పోనీలేరా - నాగూ - యీ పిల్ల బావుందన్నావుగా, రాధ అనకుండా కాంతీ అని పిలుద్దాం. అలాంటి పిలుపులతోనే కులుకుతూ కాంతిని సాధిద్దాం అంది వెంకమ్మ.

ఈ నాటి ఆశాభంగం - తన విన్నాణాలకు విరుగుడు అని నాగేశం గ్రహించాడు. కుక్కిన పేనులాగ, పల్లెటూరి పెళ్లాం-బస్తీ బావకి బలే పంగనామం పెట్టింది! అనుకుంటున్నాడు నాగేశం - ఎంతైనా ఆడాళ్లని!

రాధ తన పాత ఫక్కీ లన్నింటినీ మార్చుకుంది. కాంతిమీద తన భర్తకి ఎందుకంత అనురాగం వుందో గ్రహించింది. నానాటికీ తన నడవడితో గృహ నిర్వహణతో మంచి ఆకర్షణ ఆర్జించింది భర్త దగ్గర. కాలం తిరిగింది.

ఇప్పుడా యింట్లో ఆ యువ దంపతులు వసంత కోకిలల జంటలాగ భేదభావం లేకుండా ప్రేమపూజ చేస్తున్నారు. వెంకమ్మ మురిసిపోతూంది. కూలిపోయే కొంపని ఆ నాటి గొప్ప ఉపాయం నిలబెట్టిందని వెంకమ్మకి గర్వం.

పేరు మారిస్తే అదృష్టం మారుతుందంటారు. నన్ను రాధా! అని పిలవకండి - మీకు నచ్చిన పేరు కాంతీ అని పిలవండి - ఫరవాలేదు అంది రాధ నాగేశంతో.

పేరుల్లో లేదు. మనసులలోనే వుంది. అశాంతిమయమైన ఆనాటి కాంతినాటకం మళ్లీ ఎందుకు జ్ఞాపకం చేస్తావు రాధా, రాధ మారింది, ఆ కాంతిని మించిన రాధ యిది. అంచేత రాధ కాంతిని ఓడించి-గృహశాంతి నిర్మించింది అన్నాడు నాగేశం.

కొడుకిలా అంటూంటే గుప్పెటతో నోరు మూసుకొని విరగబడి నవ్వుతూంది వెంకమ్మ.

తలి నవ్వులు మాని నాగేశం సిగ్గుపడ్డాడు. రాధ - 'Dont Feel Sir' అంది. అం ఇంగ్లీషు నేర్చావే-ఏవిటే రాధా! నీలో యీ విమూర్తిత్వం. అన్నాడు నాగేశం.

"ముగువల్ నేరగరాని విద్య గలదే ముద్దార నేర్పించినన్" అనలేదుట్రా పెద్దలు, అంది వెంకమ్మ.

మా అమ్మ కవయిత్రి అయిందే అని నవ్వాడు నాగేశం.

ఆ నవ్వుతో తమ నవ్వు కలిపి అత్తాకోడళ్లు విజయవిలాసంతో ఇంకా నవ్వారు.

★





కేసరికుటీరం ప్రైవేట్ లిమిటెడ్
రాయపేట, మద్రాసు-14.

ఆంధ్రప్రదేశ్ ఏజంట్లు :
మెసర్సు సీతారామ్ జనరల్ స్టోర్సు ఏజెన్సీస్
విజయవాడ, సికిందరాబాదు.